సాక్షి శ్రీకాకుళం

శనివారం । 8 । ఫిబ్రవరి । 2025



జగనన్న సాయం చూపలేదు

'తండేల్' సినిమాను మత్స్యకార కుటుంబాలు చూశాయి. జగనన్న చేసిన సాయం చూపలేదని తెలిపాయి.

- 8లో



జ్యూయలరీ షాపులో చోరీ

ఉర్లాం ప్రధానవీధిలో చోరీ జరిగింది. బంగారం షాపును దోచుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

15కు విచారణ వాయిదా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంతో తొలగించిన 34 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు శ్రీకాకుళం పట్టణంలోని డే అండ్ నైట్ కూడలిలో ఉన్న లేబర్ కమిషన్ కార్యాలయంలో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అజయ్ కార్తీక్ శుక్రవారం విచారించారు. బాధితుల వాదన, వారు అందజేసిన డాక్యుమెంట్లు స్వీకరించారు. వర్సిటీ తరఫున హాజరైన న్యాయవాది వాదన విన్నారు. అనంతరం విచారణ ఈ నెల 15వ తేదీకి వాయిదా వేశారు.

పన్నుల చెల్లింపుల్లో జాప్యం వద్దు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వ్యాపారులు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు పన్నులు సకాలంలో చెల్లించకుంటే చర్యలు తప్పవని అసిస్టెంట్ కమిషనర్ (రాష్ట్రపన్నులు) శ్రీకాకుళం సర్కిల్ జి.రాణీమోహన్ అన్నారు. శ్రీకాకుళం నగరంలో కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో శుక్రవారం జీఎస్టీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాణీ మోహన్ మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి దశలో ఉన్నందున సర్కిల్ రెవెన్యూ పెంచటానికి మీ వంతు కృషి చేయాలన్నారు. జీఎస్టీ రెగ్యులర్, కాంపోజిషన్ స్కీముల్లో కొనసాగుతున్న వారు డిసెంబర్ నెల ముగిసిన కాలానికి వెంటనే తమ రిటర్న్‌లను దాఖలు చేసి సంబంధిత పన్నులు చెల్లించాలన్నారు. నిర్ణీత సమయంలో చెల్లించని వారు చట్ట ప్రకారం అపరాధ రుసుము 18 శాతం వడ్డీతో చెల్లించాల్సి వస్తుందన్నారు. పన్ను బకాయిలను 31 మార్చి 2025 లోగా చెల్లించే వారికి అపరాధ రుసుము, వడ్డీని ప్రభుత్వం రద్దు చేసినందున, వెంటనే చెల్లించేలా చేయాలని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

గిరిజనులను రక్షించండి

- ఎస్టీ కమిషన్ సభ్యులకు మాజీ స్పీకర్ తమ్మినేని వినతి



ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ కాళింగ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బూర్జ, సరుబుజ్జిలి మండలాల పరిధిలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దాన్ని నిలువరించి గిరిజనులను కాపాడాలని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఎస్టీ కమిషన్ సభ్యుడు వి.శంకర్ నాయక్‌ను కోరారు. స్థానిక ఆర్అండ్‌బీ వసతి గృహంలో శుక్రవారం ఆయనను కలిసి వినతి పత్రం అందజేశారు. థర్మల్ ప్లాంట్ నిర్మాణం జరిగితే గిరిజన ప్రజల మనుగడ కనుమరుగైపోతుందన్నారు. ఈ ప్రాంతంలో నవోదయ పాఠశాల, గిరిజన ఆశ్రమ పాఠశాల, ఇతర సంస్థలు ఉన్నాయని వాటి మనుగడ కూడా కష్టమవుతుందన్నారు. కమిషన్‌కి వినతి పత్రం అందజేసిన అనంతరం తమ్మినేని సీతారాం మీడియాతో మాట్లాడారు. బూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో 1600 ఎకరాలు, 3300 మెగావాట్లు విద్యుత్ ఉత్పాదన చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కూటమి పన్నాగాలు చెల్లవని ఆయన అన్నారు. ప్రపంచమంతా థర్మల్‌ప్లాంట్‌లను వ్యతిరేకిస్తుంటే.. ఇక్కడ పెట్టడమేంటని ప్రశ్నించారు. రెండు నదుల నీటిని ఈ ప్రాజెక్టుకు కేటాయించడం కూడా దారుణమన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల స్థానికులకు ఎలాంటి లాభం ఉండదని వివరించారు. ప్రాణాలు పణంగా పెట్టయినా ప్రాజెక్టును అడ్డుకుంటామన్నారు. గిరిజనులు చేస్తున్న పోరాటానికి తాము అండగా ఉంటామన్నారు.

గిరిజన సంక్షేమమే లక్ష్యం..

ఆర్అండ్‌బీ వసతి గృహంలో ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడారు. గిరిజన సంక్షేమమే తమ లక్ష్యమని, అడవి బిడ్డలకు అన్యాయం జరిగితే సహించబోమని తెలిపారు. మాజీ స్పీకర్ ఇచ్చిన వినతిలో ప్రతి అంశాన్ని కూలంకషంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. థర్మల్ ప్రాజెక్టుపై ఇప్పటికే తమకు ఫిర్యాదులు అందాయని తెలిపారు. థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు పెట్టడం సరైన ప్రతిపాదన కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆ రొయ్యపై మన సైందీ





ఆక్వా రైతులు ఫ్లోరిడా రొయ్యపై మన'సై'ందని అంటున్నారు.
మేలు రకం ఉత్పత్తిగా ఇప్పటికే మార్కెట్ నుంచి ప్రశంసలు అందుకుంటున్న 'సై' ఆక్వా రకం రొయ్యను తమ చెరువుల్లోనూ దింపేందుకు సైసై అంటున్నారు. వ్యాధుల తీవ్రత గణనీయంగా తగ్గడం, దిగుబడిపై నమ్మకం కుదరడంతో ఇప్పటికే పలువురు రైతులు ఈ రకంతో లాభాలు చూస్తున్నారు. వనామీలో సుమారుగా 10కి పైగా తల్లిరొయ్యల ఉత్పత్తి సంస్థలు వారి జెనెటికల్‌లైన్స్‌ను హేచరీల ద్వారా అందిస్తున్నాయి.


- రొయ్యల రైతులను ఊరిస్తున్న ఫ్లోరిడా రకం
- రికార్డు స్థాయి ఎఫ్‌సీఆర్ నమోదు
- వనామీలో సునామీ సృష్టిస్తున్న కొత్త జెనెటికల్ లైన్

పోలాకి:

జిల్లాలో ఆక్వా రైతులు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్నారు. సామాజిక మాధ్యమాల సాయంతో పలు రకాల సంస్థల సహకారంతో కొత్త కొత్త రకాలను పరిచయం చేసుకుంటున్నారు. వారిని మరింత ఉత్సాహ పరిచేలా వనామీలో కొత్తరకం జెనెటికల్ లైన్ ఇప్పుడు రికార్డు స్థాయిలో ఎఫ్‌పీఆర్ (ఫీడ్ కన్వర్షన్ రేషియో) నమోదవుతుంది. జిల్లాలో ఎక్కువ మంది రొయ్యల రైతులు ఇప్పుడు ఈ రకం రొయ్యల సాగు చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. జిల్లాలో రొయ్యల సాగు విస్తీర్ణం 4200 ఎకరాల వరకు ఉంటుంది.

ఏమిటీ 'సై' ఆక్వా

'సై' ఆక్వా అనేది ఫ్లోరిడాకు చెందిన తల్లిరొయ్యల ఉత్పత్తి సంస్థ. ఎప్పటికప్పుడు శాస్త్రీయంగా కొత్త జెనెటిక్స్ ఎంపిక, ఎగ్ ప్రొడక్షన్, లార్వాల ఉత్పత్తి, ఉత్తమ స్థాయి ఆరోగ్య నిర్వహణ చేసి మేలు రకం ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తారు. గతంలో టైగర్ రొయ్యల సాగు తర్వాత ఆక్వారంగం అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంది. వనామీ రకం సాగుతో కొంత వరకు బయటపడింది. ఆ తర్వాత రొయ్యల సాగు ఇలాంటి కొత్త జెనెటికల్ లైన్స్‌తో ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ వస్తోంది. వనామీలో సుమారుగా 10కి పైగా తల్లిరొయ్యల ఉత్పత్తి సంస్థలు వారి జెనెటికల్ లైన్స్‌ను హేచరీల ద్వారా అందిస్తున్నాయి. ఆయా ప్రాంతాల వాతావరణ



హేచరీలో కల్చర్‌కు సిద్ధంగా ఉన్న పీఎల్(పోస్ట్ లార్వా)

పరిస్థితులకు అనుగుణంగా ఆ ఉత్పత్తుల వాడకం జరుగుతుంది. మూడేళ్ల కిందటే జిల్లా పరిచయమైన సై ఆక్వా బ్యాలెన్స్ లైన్ రికార్డు స్థాయిలో విజయవంతమైంది.

బ్యాలెన్స్ లైన్ ప్రత్యేకత

అందుబాటులో ఉన్న జెనెటికల్ లైన్స్‌తో పోల్చితే తక్కువ కాలంలో ఎక్కువ పెరుగుదల కనబరుస్తూ, వ్యాధులను తట్టుకుంటూ, చక్కటి ఎఫ్‌సీఆర్ నమోదు కావటం దీని ప్రత్యేకత. ఆక్వా సాగులో మేత వినియోగం కీలకం. సగానికిపైగా పెట్టుబడి ఫీడింగ్ కోసం వెచ్చిస్తారు. సాధారణంగా 1కిలో రొయ్యల ఉత్పత్తికి 1.1కిలో నుంచి 1.3కిలో వరకు మేత వినియోగం జరిగితే రొయ్యలసాగు లాభదాయకం అనుకోవచ్చు. సై ఆక్వా సాగు చేస్తున్న రైతులు ఇప్పుడు ఇదే ఎఫ్‌సీఆర్‌లో రొయ్యల ఉత్పత్తి చేస్తున్నారు. గతంలో 1.5కు పైగా ఎఫ్‌సీఆర్ నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయి.

బ్రూడ్ స్టాక్ దిగుమతి పెంచుతున్నాం



ఇండియన్ కోస్ట్‌లో మా బ్యాలెన్స్ జెనెటికల్ లైన్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, బ్రూడ్‌స్టాక్(తల్లి రొయ్య) దిగుమతులు పెంచేందుకు ప్రతిపాదనలు చేశాం. రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి సాంకేతికంగా మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేస్తాం.

– జి.విద్యాధరరావు

రెండేళ్లుగా సాగు చేస్తున్నాం



రెండేళ్లుగా ఈ రకం పీఎల్‌ను మేము సాగు చేస్తున్నాం. కొత్త జెనెటికల్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత పాతకాలపు వ్యాధుల తీవ్రత బాగా తగ్గింది. బ్యాలెన్స్‌లైన్ అందుబాటులోకి వచ్చిన తర్వాత వైట్ గట్, రన్నింగ్ మోర్టాలిటీ వంటి వ్యాధుల తీవ్రత తగ్గింది.

– చింతు అప్పన్న, ఆక్వా రైతు, బెలమర

డిమాండ్ ఉంది



ఇటీవల కాలంలో రైతుల నుంచి సై ఆక్వా బ్యాలెన్స్ లైన్ రకం రొయ్య పిల్లలకు డిమాండ్ పెరిగింది. అందుకు తగ్గస్థాయిలో మేము కూడా సిద్ధం చేసుకోవాల్సి వస్తోంది. కొన్నిసార్లు అడ్వాన్స్ బుకింగ్ లేకపోతే పీఎల్(పోస్ట్ లార్వా) అందించలేకపోతున్నాం.

– ఎస్.కల్యాణ చక్రవర్తి, తోనంగి, గార



లేనిది ఉన్నట్టు.. అంతా కనికట్టు

- కౌలు రైతుల ముసుగులో ధాన్యం కొను'గోల్‌మాల్'
- కీలక నేత సోదరుడి అండదండలతో అక్రమాలు
- వ్యూహాత్మకంగా ఈ క్రాప్‌లో తప్పుడు వివరాలు నమోదు
- కొందరు మిల్లర్లతో కొందరు రైతు సేవా కేంద్రాల సిబ్బంది కుమ్మక్కు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

పంట లేదు.. నూర్పు లేదు.. కోత లేదు.. అసలు ధాన్యమే లేదు. కానీ ధాన్యం అమ్మిన డబ్బులు మాత్రం ఖాతాలో పడిపోయాయి. టీడీపీ కీలక నేత సోదరుడి అండతో చేసిన మాయ ఇది. ధాన్యం కొనుగోలులో జిల్లాలో పెద్ద ఎత్తున గోల్‌మాల్ జరిగింది. కౌలు రైతుల ముసుగులో కొందరు మిల్లర్లు దోపిడీ చేశారు. తమకు కావాల్సిన వారిని కౌలు రైతులుగా చూపించి, లేని భూములను ఈ-క్రాప్‌లోకి ఎక్కించి, వేయని పంటను పండినట్టుగా, ఆ పంటను కొనుగోలు చేసినట్టుగా.. ఆ కొనుగోలు చేసిన ధాన్యం కావల్సిన మిల్లర్లకే ట్యాగ్ చేసి అక్రమాలకు పాల్పడినట్టు సమాచారం. కొందరు రైతు సేవా కేంద్రాల సిబ్బంది, పలువురు మిల్లర్లు కుమ్మక్కై ఈ అక్రమాల పర్వాన్ని నడిపినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఒక కీలక నేత సోదరుడు కనుసన్నల్లో ఈ బాగోతమంతా జరిగినట్టు తెలుస్తోంది.

వ్యూహాత్మకంగా..

ఈ క్రాప్‌లో రైతులు పేరిట ఎంత భూమిని నమోదు చేస్తే అంత భూమిలో పండిన పంటను కొనుగోలు చేయాలన్నది నిబంధన. ఒక కీలక నేత సోదరుడి డైరెక్షన్‌లో కొందరు మిల్లర్లు తెలివిగా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఆ మిల్లర్లకు ఉండే భూములను వారి వద్ద ఉండే వ్యక్తులకు ఎకరా చొప్పున కేటాయించి, వారికి కౌలుకు ఇచ్చినట్టుగా చూపించి, ఈ-క్రాప్‌లో నమోదు చేయించారు. కౌలుకు ఇచ్చిన ఎకరా భూమితో పాటు సమీపంలోని ప్రభుత్వ భూములు, ముఖ్యంగా నోషనల్ ఖాతాలో ఉన్న భూములను కూడా వీరి పేరిట ఈ- క్రాప్‌లో నమోదు చేయించారు. అంటే ఆ మిల్లర్‌కు సంబంధించిన ఒక్కో కౌలు రైతుకు ఐదు నుంచి పది ఎకరాల చొప్పున నమోదు చేసినట్టు తెలిసింది. లేని భూములు ఉన్నట్టుగా చూపించే కుతంత్రం పన్నారు. ఈ మొత్తం కుట్రలో ఆ మిల్లర్లతో కొందరు రైతు సేవా కేంద్రాల సిబ్బంది భాగస్వామ్యమై కుమ్మక్కు వ్యవహారం నడిపారు. ఇక, కౌలు రైతులుగా నమోదు చేసిన వారంతా ఆ మిల్లరు కంట్రోల్‌లోనే ఉంటారు. వారినే కౌలు రైతులుగా పెట్టుకున్నారు. వీరి చేతనే ఖరీఫ్‌లో జరిగిన ధాన్యం సేకరణ సమయంలో అక్రమాలకు పాల్పడ్డట్టు ఆరోపణలు ఉన్నాయి.

అంతా కాగితాల్లోనే...



ఈ క్రాప్‌లో నమోదు చేసిన విస్తీర్ణంలో పంట పండిందని, వారి వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసినట్టు, ఆ కొనుగోలు చేసిన ధాన్యాన్ని తమకు కావల్సిన మిల్లుకే ట్యాగ్ చేసి, కొనుగోలు చేసిన మేరకు ఆ కౌలు రైతుల ఖాతాలకు బిల్లులు జమయ్యాక వారి దగ్గరి నుంచి తిరిగి తీసుకున్నట్టుగా ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి, ఆ కౌలు రైతుల పేరిట నమోదు చేసిన మేర క్షేత్రస్థాయిలో భూమి లేదు. పంట కూడా పండలేదు. కానీ అంతా కాగితాల్లో చూపించేసి, పథకం ప్రకారం అక్రమాలను కానిచ్చేశారు. ఎక్కడి ధాన్యం ఏ మిల్లుకు పంపించాలన్న ట్యాగ్ వ్యవహారం కూడా ముందస్తు వ్యూహంతో చేసినట్టు తెలిసింది. ఫలితంగా వారు అనుకున్నట్టుగానే అక్రమ బాగోతం యథేచ్ఛగా జరిగిపోయింది. లేని పంట(ధాన్యం) ఉన్నట్టు చూపించి, బిల్లులు డ్రా చేసేసినట్టు సమాచారం.

సీఎంఆర్ కింద పీడీఎస్ రైస్

అక్కడితో గ్యాంబ్లింగ్ అయిపోలేదు. సాధారణంగా మిల్లర్లకు ట్యాగ్ చేసిన ధాన్యాన్ని ఆడించి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) కింద ప్రభుత్వానికి అందజేయాల్సి ఉంటుంది. కానీ, ఇక్కడ వాస్తవంగా ఆ మిల్లులకు ధాన్యమే రాలేదు. వచ్చినట్టు రికార్డుల్లో మాత్రమే చూపించి బిల్లులు కొట్టేశారు. సీఎంఆర్‌గా ఇవ్వాల్సిన బియ్యం కింద పీడీఎస్ రైస్‌ను ఇచ్చేస్తున్నట్టు కూడా తెలిసింది. బయట పీడీఎస్ రైస్ కిలో రూ. 25 నుంచి 28వరకు కొనుగోలు చేసి, దాన్నే ప్రభుత్వం నిర్దేశించిన గోడౌన్‌లకు అందజేస్తున్నట్టుగా తెలియవచ్చింది. ఇప్పటికే కొన్నిచోట్ల సీఎంఆర్ కింద పీడీఎస్ రైస్ ఇచ్చినట్టు ఓ ప్రభుత్వ సంస్థ అధికారి గుర్తించగా, ఆయనకు వార్నింగ్ వెళ్లినట్టు తెలిసింది.

విచారణ జరిపితే గుట్టురట్టు



ఈ అక్రమాల వల్లనే జిల్లాలో చాలా మంది రైతుల వద్ద పండిన ధాన్యం ఉండిపోయింది. లక్ష్యాలు పూర్తయిపోయాయని మిల్లర్లు చేతులేత్తేయడంతో ప్రభుత్వం కూడా కొనుగోళ్లను చాలా వరకు నిలిపివేసింది. ఇప్పటి వరకు 4లక్షల 51వేల 10మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టుగా అధికారుల నివేదికలు చెబుతున్నాయి. ఇప్పటికే లక్ష్యం పూర్తయ్యిందని మిల్లర్లు చేతులెత్తేయడంతో కొనుగోళ్లు చేయలేకపోయామని, కొనుగోళ్ల లక్ష్యం మరింత పెంచాలని ప్రభుత్వానికి నివేదించినట్టు అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి ఆ లక్ష్యం పూర్తవ్వడం వెనక కౌలు రైతుల ముసుగులో కొందరు మిల్లర్లు ఆడిన అవినీతి నిర్వాకమే కారణమని తెలుస్తోంది. సారవకోట, నరసన్నపేట, జలుమూరు, పోలాకి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి తదితర మండలాల్లో ఎక్కువగా అవినీతి జరిగినట్టు తెలిసింది. ఇక్కడున్న కౌలు రైతుల పేరిట ఈ క్రాప్‌లో నమోదు చేసిన భూముల వివరాలు, పంట పండించినట్టు చూపించిన లెక్కలు, ప్రభుత్వానికి విక్రయించి, ఆ మేరకు బిల్లులు పొందిన వ్యవహారం, ఆ కౌలు రైతుల ధాన్యాన్ని పంపించేందుకు ట్యాగ్ చేసిన మిల్లులపై లోతుగా విచారణ జరిపితే మొత్తం గుట్టు రట్టు అవుతుంది.

ఇక రాజులమ్మ జాతరే



శ్రీరాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) విగ్రహం

- నేటి నుంచి వత్సవలస రాజమ్మ తల్లి జాతర
- ఈ ఏడాది పది వారాల పాటు జరగనుందని జాతర దాసుడు పేరయ్య వెల్లడి
- వన్‌వేలో వాహనాలు, భక్తులు రావాలని సూచిస్తున్న పోలీసులు

గార:

మండలంలోని చిన్న వత్సవలసలో కొలువైన రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరిదేవి) జాతర శనివారం నుంచి మొదలుకానుంది. శనివారం రాత్రికి వచ్చే భక్తులు ఇక్కడే బస చేసి రాజరాజేశ్వరి (రాజమ్మతల్లి)తో పాటు భూలోకమ్మ తల్లిని ఆదివారం దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించి, కుటుంబ సమేతంగా ఇక్కడే వంట చేసుకుంటారు. ఆది పీఠాలైన మైలపల్లి పేరయ్యదాసు, శ్రీనివాసదాసు, జయమ్మల ఐదు ఉండగా, ఇప్పుడు 15 పీఠాల వరకు ఏర్పడ్డాయి. ఈ జాతరకు ఏడాదికి ఒక్కసారైనా రావాలన్న నిబంధన ఉంది. ముఖ్యంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన చిన్నారికి పుట్టు కొప్పు (తలనీలాలు)ఇక్కడ తీయించి మొక్కులు తీర్చుకుంటే ఆ చిన్నారికి మంచి భవిష్యత్ ఉంటుందని భక్తుల్లో నమ్మకం. అందుకే మత్స్యకారుల్లో మషేను, పేరయ్య, దాసు వంటి పేర్లు అధికంగా ఉంటాయి.

రాత్రి వేళ గట్టి నిఘా..

రాజమ్మ తల్లి జాతరకు పటిష్ట బందోబస్తులో భాగంగా రాత్రి వేళ గట్టి నిఘా ఏర్పాటు చేసినట్టు శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ పైడపునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వత్సవలస గ్రామస్తులు, భక్తులు, పోలీసులు, మండల స్థాయి అధికారుల సమన్వయంతో జాతరను జరిపించేందుకు కఠిన చర్యలు చేపట్టామన్నారు. అదేవిధంగా వన్‌వే ట్రాఫిక్ ఆంక్షలు ఉన్నాయని, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఆర్టీసీ వత్సవలస జాతరకు ప్రత్యేక బస్‌లు నడుపుతోంది.

15 ఏళ్లుగా వస్తున్నా



పదిహేను ఏళ్లుగా రాజమ్మ తల్లి జాతరకు వస్తున్నాను. ఈ ఏడాది విశాఖపట్నంలో పెళ్లి కారణంగా ముందుగా వచ్చాను. ఏది ఏమైనా సంక్రాంతి తర్వాత తల్లిని దర్శించుకుంటున్నాను. మా కుటుంబ సభ్యులందరం వచ్చి ఇక్కడే వంటలు చేసుకొని జాగరణ చేస్తాం. మా బాబు చిన్నారి పుట్టు కొప్పు ఇక్కడే తీశాం.

– హైమావతి, చీరాల, భక్తురాలు

పది వారాలుగా...



ఈ ఏడాది పదివారాలు పాటు జాతర జరగనుంది. మూడు మాసాల పాటు స్వతంత్రంగా జాతర నిర్వహించుకుంటున్నాం.

– మైలపిల్లి పేరయ్య, ప్రధాన పీఠం దాసుడు,చిన వత్సవలస

బంధనాల బతుకులు



పైన ఎర్రటి ఎండ.. కింద నిప్పులా మండే తారు. ఒకరి కాళ్లకు అదృశ్య ఆకలి సంకెళ్లున్నాయి. అందుకే కదలకుండా నిలుచున్నాడు. బకెట్‌లో ఒక రూపాయి పడినా అతడికి ఏసీ గాలి వీచినంత సంబరం. మరొకరి ఒంటికి బా'నిషా' బంధనాలున్నాయి. అందుకే కదల్లేక పడుకున్నాడు. మత్తు దిగే వరకు కష్టాలు కన్నీళ్లేవీ లేవు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద కనిపించిన దృశ్యమిది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ప్రభుత్వం దృష్టికి ఆదివాసీల సమస్యలు

- థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా గిరిజనుల పోరాటం
- ఎస్టీ కమిషన్‌సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్



అడ్డూరిపేట గ్రామంలో సమావేశానికి హాజరైన ఆదివాసీలు



అడ్డూరిపేటలో ఆదివాసీల సమావేశానికి హాజరైన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్

బూర్జ: మండలంలోని అన్నంపేట పంచాయతీ అడ్డూరిపేట గ్రామంలో బూర్జ, సరుబుజ్జిలి మండలాల ఆదివాసీలు శుక్రవారం నిర్వహించిన సమావేశానికి ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై గిరిజనులకు మనోధైర్యం కల్పించారు. ఏ ఒక్క ఆదివాసీకి కష్టం వచ్చినా అందరం కలసికట్టుగా పోరాటం చేద్దామని హామీ ఇచ్చారు. థర్మల్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఆదివాసీల పోరాటాన్ని ప్రభుత్వానికి తెలియజేసి ప్లాంట్ నిలుపుదలకు కృషి చేస్తానన్నారు. ఈ ప్లాంట్‌ను రెండు మండలాలకు చెందిన గోపీదేవిపేట, మసానపుట్టి, బూర్జ మానుగూడ, అనంతగిరిపేట, జంగాలపాడు, బొడ్లపాడు, జె.వి పురం, వెన్నెలవలస-1, వెన్నెలవలస-2తో పాటు సుమారుగా 20 గ్రామాల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగా మాట్లాడుతూ పర్యావరణాన్ని కలుషితం చేసే ప్రతిపాదనలు తక్షణమే ఆపాలన్నారు. ఆదివాసీల నెత్తిన కుంపటి పెట్టడం స్థానిక ఎమ్మెల్యేకు సమంజసమా అని నిలదీశారు. పవర్ ప్లాంట్ నిర్మాణం ప్రతిపాదన విరమించే వరకు పోరాడదామన్నారు.

కార్యక్రమంలో తహసీల్దార్ వైవీ పద్మావతి, ఎస్ఐ ఎం.ప్రవల్లిక, ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి, ఆదివాసి నాయకులు అప్పల నాయుడు, సురేష్ దొర, శశిభూషణ రావు, అప్పలనాయుడు, సవర సింహాచలం, సవర కృష్ణ, లక్ష్మణరావు, ధర్మారావు, సవర ప్రియాంక, పాలక విజయ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సోదరుడికి తలకొరివి పెట్టిన సోదరి



సుధాకర్‌కు తలకొరివి పెడుతున్న అక్క కృష్ణవేణి

నందిగాం : మండలంలోని హరిదాసుపురంలో తోడబుట్టిన సోదరుడికి సోదరి తలకొరివి పెట్టిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కణితి ఆనందరావు, రత్నాలు దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. అందరికీ వివాహలయ్యాయి. కుమారుడు సుధాకర్ భార్య విడాకులు తీసుకుంది. ఇటీవల సుధాకర్ తీవ్ర అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తండ్రి ఆనందరావు మూడేళ్ల క్రితం మృతి చెందడం, తల్లి వృద్ధాప్యంతో బాధపడుతుండటంతో సోదరి కృష్ణవేణి తలకొరివి పెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది.

కార్గో ఆదాయం పెరగాలి



హమాలీలతో మాట్లాడుతున్న అప్పలనాయుడు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో ఆదాయాన్ని పెంచేందుకుఅధికారులు, సిబ్బంది, కలాసీలు సమన్వయంతో పనిచేయాలని విజయనగరం జోన్–1 డిప్యూటీ సీటీఎం (ఓసీ) బి.అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం కార్గో కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి, హమాలీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులు క్యూఆర్ కోడ్ ద్వారా కూడా బుకింగ్స్ చేసుకోవచ్చని తెలిపారు. వాట్సాప్ ద్వారా టికెట్స్ బుక్ చేసుకోవచ్చని చెప్పారు. డోర్ డెలివరీ ద్వారా సరుకులను ఇంటికి వద్ద చేరుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ ఆర్.వి.రావు, ఇజాజ్, ఎస్‌ఎం ఎం.పి.రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం ఎంఈఓ మృతికి సంతాపం



జి.కృష్ణారావు(ఫైల్)

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం రూరల్, అర్బన్ మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న గువ్వాడ కృష్ణారావు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం విశాఖపట్నంలోని ఓ ఆస్పత్రిలో మృతి చెందారు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. స్వగ్రామం నందిగాం మండలం సింగుపురం. 2001లో ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించిన ఈయన 2015లో మండల విద్యాశాఖాధికారిగా పదోన్నతి పొందారు. గతంలో ఆమదాలవలస, గార మండలాలకు ఇన్‌చార్జి ఎంఈఓగా వ్యవహరించారు. కృష్ణారావు మృతి పట్ల డీఈఓ తిరుమల చైతన్య, ఉప విద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, ఎంపీడీఓ బి.శైలజ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో జేసీబీ దగ్ధం



కాలిపోతున్న జేసీబీ

జి.సిగడాం: మండలంలోని బాతువ గ్రామంలో కలిగి ఢిల్లీశ్వరరావు చెందిన సుమారు రూ.50 లక్షల విలువైన జేసీబీ అగ్నికి ఆహుతైంది. పొలం పనులు చేస్తుండగా షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న రాజాం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే యంత్రం కాలిపోయింది.

ఎమ్మెల్సీ స్థానానికి ఐదో రోజు

నాలుగు నామినేషన్లు

- ఇప్పటివరకు 8 నామినేషన్ల దాఖలు
- శని, ఆదివారం సెలవు, సోమవారం ఆఖరు



విశాఖ కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న పీఆర్టీయూ మద్దతు అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు

మహారాణిపేట: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి శుక్రవారం మరో నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో ఇప్పటి వరకు దాఖలైన నామినేషన్ల సంఖ్య 8కి చేరింది. పీఆర్టీయూ మద్దతుతో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, స్వతంత్ర అభ్యర్థులు నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, ఎస్టీ, ఎస్టీ బహుజన ఫోరం అభ్యర్థి పోతల దుర్గారావు తమ మద్దతుదారులతో కలిసి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్‌కు సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులతో కలెక్టర్ ప్రమాణం చేయించారు. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల ప్రక్రియకు గడువు కాగా.. ఇప్పటికే ఐదు రోజులు గడిచిపోయింది. రెండో శనివారం, ఆదివారం సెలవు కావడంతో సోమవారం ఒక్క రోజే ఇంకా నామినేషన్లు వేయడానికి గడువు ఉంది. ఇప్పటివరకు ఎనిమిది నామినేషన్లు దాఖలవ్వగా అభ్యర్థులు 14 సెట్లు సమర్పించారు. ఏఆర్వో, డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, నోడల్ అధికారి, వీఎంఆర్డీఏ ఎస్టేట్ అధికారి దయానిధి పాల్గొన్నారు.

టీచర్ల సమస్యలు పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను శక్తి వంచన లేకుండా పరిష్కరిస్తానని మాజీ ఎమ్మెల్సీ, ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసుల నాయుడు అన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీగా నామినేషన్ దాఖలు చేసిన తర్వాత కలెక్టరేట్ ప్రాంగణంలో శ్రీనివాసుల నాయుడు మీడియాతో మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్సీగా పనిచేసిన సమయంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించడంలో కీలకంగా పని చేశానన్నారు. తనకు పలు ఉపాధ్యాయుల సంఘాల మద్దతు ఉందని తెలిపారు. కాగా.. ఆర్టీసీ కాంప్లెక్స్‌కు సమీపంలోని ప్రైవేట్ పంక్షన్‌లో హాలులో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ, మిత్ర సంఘాలు ఏపీటీఎఫ్ 1938, ఏపీ యూఎస్, ఎస్టీయూ, ఏపీటీడబ్ల్యూటీఏ, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్, పీఈటీ అసోసియేషన్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఏపీటీఏ), గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్, కాంట్రాక్ట్ డిగ్రీ లెక్చరర్స్ అసోసియేషన్, జూనియర్ కాలేజ్ లెక్చరర్స్ అసోసియేషన్‌లు శ్రీనివాసుల నాయుడుకు మద్దతు ప్రకటించాయి. పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిట్ట కృష్ణయ్య, ఏఎం గిరిప్రసాద్ రెడ్డి, రాష్ట్రస్థాయి నాయకుడు వైష్ణవ కరుణానిధి, ఏపీటీఎఫ్(1938) రాష్ట్ర అధ్యక్షుడు హృదయ రాజు, ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఎస్టీయూ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఇమంది పైడిరాజు, పీఆర్టీయూ ఉమ్మడి జిల్లా కన్వీనర్ డి.గోపీనాథ్ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు పి.వి.ఎస్.మాధవ్ సమావేశంలో పాల్గొని.. రాజకీయాలకు అతీతంగా.. ఉపాధ్యాయుల సమస్యలపై పట్టు ఉన్న గాదె శ్రీనివాసుల నాయుడును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఆరు జిల్లాలకు సంబంధించిన అన్ని సంఘాల అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు.

జగనన్న చేసిన సాయం.. 'తండేల్'లో చూపకపోవడం బాధాకరం

- కె.మత్స్యలేశం వాసి మూగి గురుమూర్తి



మూగి గురుమూర్తి

శ్రీకాకుళం అర్బన్: తండేల్ సినిమా యథార్థ ఘటన ఆధారంగా తీసినప్పటికీ అందులో పూర్తిస్థాయిలో సన్నివేశాలు చూపలేదని కె.మత్స్యలేశం గ్రామవాసి, మత్స్యకార సంఘ నాయకుడు, న్యాయవాది మూగి గురుమూర్తి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రీల్ స్టోరీ తీశారే తప్ప రియల్ స్టోరీ తీయలేదన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 2018 నవంబర్ 28న 22 మంది మత్స్యకారులు పాకిస్తాన్ జైల్లో బందీలుగా చిక్కుకున్నారని, వారిని విడుదల చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. అపుడు ప్రతిపక్షనేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజాంలో జరుగుతున్న పాదయాత్రలో కలిశామని, మత్స్యకార కుటుంబాల సమస్య వివరించామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బందీలను విడిపించారన్నారు. అనంతరం 22 మంది మత్స్యకారులతో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సమావేశం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారన్నారు. ఒక్కొక్కరికి రూ.5లక్షలు చొప్పున ఆర్థిక సహాయం కూడా చేశారన్నారు. ఈ సంఘటన తండేల్ సినిమాలో లేకపోవడం బాధాకరమన్నారు.

ప్రేక్షక దేవుళ్లకు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న తీడ కార్తీక్

శ్రీకాకుళం అర్బన్: 'తండేల్' సినిమాను విజయవంతం చేసిన ప్రేక్షక దేవుళ్లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సినిమా చిత్ర కథా రచయిత తీడ కార్తీక్ అన్నారు. శ్రీకాకుళంలోని ఎస్‌వీసీ థియేటర్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తండేల్ సినిమా విజయంతో వచ్చిన సౌండ్ శ్రీకాకుళం నుంచి హైదరాబాద్ వరకు దేశవ్యాప్తంగా వినిపిస్తోందన్నారు. సక్సెస్ మీట్‌కు చిత్ర యూనిట్ మొత్తం త్వరలోనే శ్రీకాకుళం రానుందని తెలిపారు. మత్స్యకారుడు గనగళ్ల రామారావు మాట్లాడుతూ పాకిస్తాన్‌లో తాము పడిన ఇబ్బందులు, బాధలను దర్శకుడు చందు కళ్లకు కట్టినట్లు చూపించారన్నారు. బందీగా ఉన్న సమయంలో అన్ని ప్రభుత్వాలు ఆదుకున్నాయన్నారు. సమావేశంలో ఎస్‌వీసీ థియేటర్ మేనేజర్ రవి, అభిమానులు పాల్గొన్నారు.

ముగిసిన గ్రిగ్స్ పోరు

- బాలబాలికల ఆల్‌రౌండ్ చాంపియన్స్‌గా శాస్త్రులపేట, పలాస ఎంజేపీ పాఠశాలలు



ఆల్‌రౌండ్ చాంపియన్(బాలికలు)గా ఎంజేపీ స్కూల్ పలాస బృందం



ఆల్‌రౌండ్ చాంపియన్(బాలురు)గా ఎంజేపీ స్కూల్ శాస్త్రులపేట బృందం

శ్రీకాకుళం న్యూకాలనీ:

జిల్లాస్థాయి పాఠశాలల గ్రిగ్స్ ఫైనల్స్ పోరు ముగిసింది. మూడు రోజులపాటు సాగిన పోటీలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. జిల్లా విద్యాశాఖ పరిధిలోని జిల్లా పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యంలో స్థానిక టీపీఎంహెచ్ స్కూల్ సారథ్యంలో శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం ప్రాంగణంలో జరిగిన ఈ పోటీల్లో తొలిరోజు బాలురుకు 10 క్రీడాంశాల్లో, రెండోరోజు బాలికలకు 8 క్రీడాంశాల్లో, ఆఖరి, మూడవరోజైన శుక్రవారం బాలబాలికలకు అథ్లెటిక్స్ ఈవెంట్స్ నిర్వహించారు.

ఆల్‌రౌండ్ ఛాంపియన్స్‌గా శాస్త్రులపేట, పలాస..

అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో బాలబాలికలకు 100, 200, 400, 800, 1500, 3000 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో, 400 మీటర్ల రిలే పరుగు పోటీల్లో సీతాపురం, శాస్త్రులపేట, పలాస, గోవిందపురం, ఇచ్ఛాపురం, కుప్పిలి, ఇప్పిలి, యందువ, ఈదుళ్లవలస తదితర పాఠశాలల క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. స్పోర్ట్స్ చాంపియన్స్‌గా జెడ్పీహెచ్ స్కూల్ సీతాపురం(బాలుర విభాగం), జెడ్పీహెచ్ స్కూల్ కుప్పిలి (బాలికల విభాగం) నిలిచాయి. వ్యక్తిగత చాంపియన్లుగా పి.హర్షవర్ధన్ (సీతాపురం), బి.దుర్గ (కుప్పిలి) నిలిచారు. మొత్తమ్మీద మూడు రోజుల గ్రిగ్స్‌మీట్‌లో ఆల్‌రౌండ్ చాంపియన్‌షిప్‌ను బాలురు విభాగంలో ఎంజేపీ స్కూల్ శాస్త్రులపేట, బాలికల విభాగంలో ఎంజేపీ స్కూల్ పలాస కైవశం చేసుకున్నాయి.పోటీలను విజయవంతం చేసిన ప్రతిఒక్కరికి పాఠశాలల క్రీడల సంఘం గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బీవీ రమణ, సంపతిరావు సూరిబాబు, పి.తవిటియ్య, మెట్ట తిరుపతిరావు, వై.పోలినాయుడు, బి.నిర్మల్‌కృష్ణ, నారాయణరావు, రాజారావు, శ్రీనివాసరావు, యశోద, తదితరులు పాల్గొన్నారు.

'పీఎంజే'లో సరికొత్త వజ్రాభరణాలు



నూతన షోరూమ్‌లో బిజినెస్ హెడ్ హైదర్‌అలీ

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దక్షిణ భారతదేశంలోనే అత్యంత ఫైన్ జ్యూయలరీ బ్రాండ్ పీఎంజే జ్యువెల్స్ అని ఆమదాలవలస ఎమ్మెల్యే సతీమణి కూన ప్రమీల అన్నారు. శ్రీకాకుళం జీటీ రోడ్డులో ఏర్పాటు చేసిన పీఎంజే నూతన జ్యూయలరీ షాపును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ఆంధ్రప్రదేశ్ బిజినెస్ హెడ్ హైదర్ ఆలీ, వైజాగ్ క్లస్టర్ డైరెక్టర్ ఆనంద్ జిలగం మాట్లాడుతూ నాణ్యతకు, నమ్మకానికి అనువైన షాపు పీఎంజే అని చెప్పారు. సిక్కోలు ప్రజల అభిరుచులకు తగినట్లుగా అన్ని రకాల ఆభరణాలు అందుబాటులో ఉంచామన్నారు. వజ్రాలు, బంగారం విలువైన స్టోన్స్‌తో కూడిన విస్తృత డిజైన్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వివాహాది, శుభకార్యాలకు, వేడుకలకు అనువైన తేలికపాటి క్రియేషన్లు కూడా స్టోర్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో సరికొత్త డిజైన్లను చూసేందుకు నగరవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

బాలల సంరక్షణపై దృష్టిపెట్టాలి



ఆస్పత్రి సిబ్బందితో కలిసి అవగాహన కల్పిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: బాలల సంరక్షణకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. నగరంలోని ఆస్పత్రిలో శుక్రవారం సిబ్బందికి బాలల చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వేజోన్‌లో శివారు ప్రాంతాలను విస్మరించడం తగదు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కంచిలి: విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేసే ప్రక్రియలో పలాస తర్వాత ఉన్న ఆరు స్టేషన్లను విస్మరించడంపై ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్ సీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కంచిలిలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన విశాఖ జోన్‌లో జిల్లాకు శివారులో ఉన్న పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే సుమ్మాదేవి, మందస, బారువ, సోంపేట, జాడుపూడి, ఇచ్ఛాపురం స్టేషన్లను విస్మరించడం ఏంటని కూటమి పాలకుల్ని ప్రశ్నించారు. ఈ ప్రాంతంపై వివక్ష ప్రదర్శించడం తగదన్నారు. కేంద్రమంత్రి, పలాస, ఇచ్ఛాపురం ఎమ్మెల్యేలు ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఆరు స్టేషన్లను విశాఖజోన్ పరిధిలో చేర్పించకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, సీనియర్ నేత ఇప్పిలి కృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, ఎం.ఎస్.పల్లి ఎంపీటీసీ బుడ్డెపు విశ్వనాథం, కేసరపడ పార్టీ నేత కప్పల యుగంధర్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గేదెల దాలయ్య పాల్గొన్నారు.

మతతత్వ శక్తుల నుంచి దేశాన్ని కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): దేశాన్ని కార్పొరేట్ శక్తులు, మతతత్వ శక్తులు పాలిస్తున్నాయని, వాటి నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత పౌరులపై ఉందని సీనియర్ పాత్రికేయుడు, సంపాదకుడు కె.శ్రీనివాస్ అన్నారు. ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అరసవల్లిలోని ఓ కల్యాణ మండపంలో ప్రతినిధుల సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో సంబంధాలు కలిగి ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలు పొందడంలో ఘోరంగా విఫలమవుతోందన్నారు.

సీపీఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ మోదీ సర్కార్ మతోన్మాదంతో రెచ్చిపోతోందని, ఆర్‌ఎస్ఎస్ భావజాలంతో పాలన సాగిస్తూ లౌకిక వాద దేశంలో మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు, స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు యువత పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగ అమలు కావాలని, అప్పుడే అసమానతలు లేని సమాజం సాధ్యమవుతుందని అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ టూరిజం దేశ భవిష్యత్ అంటున్న పాలకులు ఆ పేరుతో గిరిజన ప్రాంతాల్లో కార్పొరేట్ శక్తులు పాగా వేసే ప్రమాదం ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, విశాఖ ఉక్కు పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, రాష్ట్ర నాయకులు సీ.హెచ్ గీత, పి. సంతోష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, తిరుమలై రామన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బొరివంకలో అంతర్రాష్ట్ర నాటక పోటీలు



అంతర్రాష్ట్ర నాటిక పోటీలకు బొరివంకలో సిద్ధం చేసిన కళావేదిక

కవిటి: మండలంలోని బొరివంకలో శనివారం నుంచి అంతర్రాష్ట్ర నాటక పరిషత్ పోటీలు ప్రారంభం కానున్నాయి. కళింగ సీమ కళాపీఠం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొదటి నాటక పరిషత్ పోటీల్లో శనివారం రాత్రి 7 గంటలకు గుంటూరు జిల్లా కొలకలూరుకు చెందిన సాయి ఆర్ట్స్ వారి 'జనరల్ బోగీలు' అనే నాటిక ప్రదర్శన ఉంటుంది. 9 గంటలకు రెండో ప్రదర్శనగా 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత?' అనే నాటిక ప్రదర్శిస్తారు. జిల్లా నలుమూలల నుంచి కళాభిమానులు, కళాకారులు పెద్దసంఖ్యలో హాజరై కార్యక్రమాల్ని విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి కోరారు.

విద్యార్థిని ఢీకొట్టి.. అధ్యాపకుడిని బెదిరించి!

- శ్రీకాకుళం నగరంలో శృతిమించిన ఆకతాయిల ఆగడాలు



యువకులు వినియోగించిన ద్విచక్రవాహనం

శ్రీకాకుళం: నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో శ్రీచైతన్య కాలేజీ వద్ద ఆకతాయిల ఆగడాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. కాలేజీ ప్రారంభం విడిచిపెట్టే సమయాల్లో ఆకతాయిలు ద్విచక్ర వాహనాలపై చేరుకుని విద్యార్థులను ఈవిటీజింగ్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తిస్తూ భయపెడుతున్నారు. శుక్రవారం కాలేజీ విడిచిపెట్టే సమయానికి బైక్‌పై ముగ్గురు యువకులు కాలేజీ వద్దకు చేరుకుని ఓ విద్యార్థినిని ఢీకొట్టారు. దీంతో ఆమెకు స్వల్పంగా గాయాలయ్యాయి. రోదిస్తున్న విద్యార్థినిని చూసి అదే కాలేజీకి చెందిన ఓ అధ్యాపకుడు ఏమైందని అడిగి తెలుసుకున్నారు. ఇందుకు బాధ్యులైన యువకులు అధ్యాపకుడిని సైతం బెదిరించారు. పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

జ్యూయలరీ షాపులో చోరీ

- 30 కేజీల వెండి వస్తువులు మాయం
- 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదును పట్టుకెళ్లిన దుండగులు



చోరీకి గురైన బంగారం షాపు వద్ద గుమిగూడిన జనం



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం ప్రధాన వీధిలో అయ్యప్ప జ్యూయలరీ షాపులో దొంగలు పడ్డారు. గురువారం అర్ధరాత్రి ముసుగులు ధరించి మారణాయుధాలతో వచ్చిన దుండగులు 30 కేజీల వెండి వస్తువులు, 20 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.20 వేలు నగదు చోరీ చేసినట్లు షాపు యజమాని అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు సీసీ పుటేజీల్లో దుండగుల కదలికలు రికార్డయ్యాయి. ఐదు నుంచి ఏడుగురు వ్యక్తులు కత్తులు చేతపట్టి ద్విచక్ర వాహనాలపై వచ్చి ఈ చోరీకి పాల్పడినట్లు సమాచారం.

20 ఏళ్లుగా వ్యాపారం..

బెజ్జిపురం వద్ద కలిశెట్టిగూడెంకు చెందిన కళిశెట్టి అప్పలనాయుడు నరసన్నపేటలో నివాసముంటూ ఉర్లాంలో 20 ఏళ్లుగా బంగారం షాపు నిర్వహిస్తున్నారు. ఇటీవలే షాపును పునర్నిర్మించి గ్రిల్స్, షట్టర్లు పటిష్టం చేశారు. ఎప్పటిలాగే గురువారం రాత్రి దుకాణం క్లోజ్ చేసుకొని ఇంటికి వచ్చేశారు. శుక్రవారం ఉదయానికి సమీపంలోని టిఫిన్ సెంటర్ నిర్వాహకులు బంగారం షాపు గ్రిల్స్ తొలగించి ఉండటం, షట్టర్ ఎత్తి ఉండటంతో అప్పలనాయుడుకు సమాచారం ఇచ్చారు. ఆయన షాపు వద్దకు చేరుకుని దొంగలు పడ్డారని గుర్తించి పోలీసులకు విషయం చెప్పారు. వెంటనే సీఐ జె.శ్రీనివాసరావు, ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌లు షాపును పరిశీలించి క్లూస్ టీమ్‌ను రప్పించారు. దొంగల వేలిముద్రలు సేకరించారు. శ్రీకాకుళం సీసీఎఫ్ పోలీసు బృందం వచ్చి ఆధారాలు సేకరించారు.

లాకర్ తెరిచేందుకు విశ్వప్రయత్నం..

షాపులో పురాతన లాకర్ ఒకటి ఉంది. షాపు క్లోజ్ చేసే ముందు విలువైన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు ఇందులోనే పెట్టి తాళాలు వేస్తుంటారు. దీంట్లో భాగంగా గురువారం కూడా అలాగే చేశారు. ఈ లాకర్‌ను తెరిచేందుకు దొంగలు విశ్వప్రయత్నం చేశారు. అయినా తెరుచుకోకపోవడంతో చోరీ సొత్తు కొంత తగ్గింది. లాకర్‌లో రెండు కేజీలకు పైగా బంగారు ఆభరణాలు, పెద్ద ఎత్తున వెండి ఉన్నట్లు సమాచారం. కాగా దొంగలు షాపు వెనుక భాగం నుంచి వచ్చి చుట్టూ ఉన్న 20 తాళాలను విరగ్గొట్టారు. షాపు మెయిన్ షట్టర్ కొంత వరకూ ఎత్తి లోపలకు వెళ్లారు. వెంటనే సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. టీవీని సైతం ఎత్తుకుపోయారు. అయితే సీసీ పుటేజీ స్టోరేజీ యూనిట్‌ను గుర్తించక అక్కడే వదిలేశారు. ఇవన్నీ అందులో రికార్డయ్యాయి. ఈ చోరీ అంతర్రాష్ట్ర దొంగల ముఠా పనే అని పోలీసులు అనుమానిస్తున్నారు. యజమాని అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, 25 కేజీలు వెండి వస్తువులు చోరీకి గురయ్యాయని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తిరువీధి



శాలిహుండం సమీపంలో తిరువీధి

గార: శాలిహుండం కొండ దిగువనున్న లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవమూర్తులకు తిరువీధి ఉత్సవం శుక్రవారం సాయంత్రం వైభవంగా జరిగింది. గిరియాత్రలో భాగంగా ముందుగా స్వామి ఉత్సవమూర్తులను శాలిహుండం, కొత్తపేట, బోరవానిపేట, తంగుళ్లపేట తదితర గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త సుగ్గు మధురెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకొని హారతులు పట్టారు. శనివారం ఉదయం వంశధార నదిలో చక్రతీర్థ స్నానం, కొండపైన దర్శనాలు ఉండటంతో పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇప్పటికే కొండవద్దకు దూరప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు చేరుకున్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా శ్రీకాకుళం డీఎస్పీ వివేకానంద, సీఐ పైడపునాయుడు ఆధ్వర్యంలో 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. కొండపైన, కిందన పాఠశాల ఆవరణలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు సిద్ధం చేశారు.

కనులపండువగా క్షీరాభిషేకం

శాలిహుండం కాళీయ మర్దన వేణుగోపాలస్వామికి శుక్రవారం రాత్రి 12 గంటల తర్వాత భీష్మ ఏకాదశి సందర్భంగా క్షీరాభిషేకం కనుల పండువగా జరిగింది. ఆలయ ట్రస్టీ సుగ్గు మధురెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, పూజాసామగ్రిని స్వామికి సమర్పించగా, భక్తులు తెచ్చిన పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు వివిధ తీర్థ జలాలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు.



పోలీసులకు సూచనలిస్తున్న సీఐ పైడపునాయుడు